
కథా నిలయం
4643
శ్రీకాకుళం



# గజ్జెల పట్టా గొలుసులు

మెగాసిటీల్లో జనాలు ఎగబడి చూసిన సినిమా గదాని అరగంట ముందే ఆటోలో వస్తే ... ఇదీ పరిస్థితి. మాసిపోయిన వాల్‌పోస్టర్లు, బోసిపోయిన బుకింగ్ కౌంటర్లు.

బాల్కనీ బావురుమంటోంది. అందులో నేనొక్కడినే బిక్కుబిక్కుమంటున్నాను. కొద్ది సేపట్లో సినిమా ప్రారంభం కావాలి. దేహం కన్నా దేశం మిన్న అనే భావం అలరింపుతో ఆర్మీలో పంజేసినన్ని రోజులు తృప్తిగా గడిచింది. ఆర్మీలోంచి బయటికొచ్చాక హిందీ సినిమా చూసే అవకాశమే రాలేదు. ఆదివారం మ్యాట్నీ షో కొస్తే ఇలాగుంది. మసక వెలుతురు చీల్చుతూ కుర్చీలను కలియజూశాను. ఫస్ట్‌క్లాసులో ఒకరిద్దరు లాస్ట్ క్లాసులో

ఐదారుగురు ... ప్చ్ .. క్లాస్ జనాలను, మాస్ గ్యాంగుల్ని ఆకర్షించలేని ఈ సినిమా కొచ్చానే! ఇతివృత్తం దేశభక్తి. తైతక్కలు, తమాషాలు తక్కువట. అందుకే ఇలాగుంది గిరాకి.

గల్ గల్... ఘల్... ఘల్లుఘల్లు.. కాలిమువ్వల సవ్వడి కమ్మగా వినబడింది. డిగ్రీ చదివే రోజుల్లో మా ఇంటి ఓనరు కూతురు... ఇంటర్ చదువుతున్న రేవతి నడుస్తుంటే గజ్జెల పట్టాగొలుసులిలాగే ధ్వనించేవి. ఆశ్చర్యం. ఆమె రేవతి లాగానే ఉందే ! గబగబా గేటుదాకా వెళ్లాను.

"మ్మీ ... మీరు రేవతి గదూ !" ఆసక్తి పొంగుకొచ్చింది.

"అవును" కోయిల గొంతు. "మ్మీ... మీరు చంద్రం గారు గదూ?" విస్మయంగా చూసింది. కుడిచెయ్యి చూపుడు వేలు బుగ్గ మీదుంది. ఆ దృశ్యాన్ని కెమెరాలో బంధిస్తే... ఎంత బావుంటుందో !

"ఇటు రా కూచుందాం" ఆహ్వానించాను. పక్కపక్కన కూచున్నాం. గుండెల్లో గుసగుసలు.

ఆ రోజుల్లో ... యౌవ్వనప్రాదుర్భావంతో మిసమిసలాడుతున్న రేవతి పరికిణీ, జాకెట్టు, వోణీతో సీతాకోకచిలుకలా ఇల్లంతా తిరుగుతూంటే మువ్వల పట్టాగొలుసుల సవ్వడి చెవులకింపుగా వినబడేది. మంజీరనాదాలను మరిపించే ఆ ధ్వనితరంగాలు వినిపించినంత సేపు నా మనసు పుస్తకంలో లీనమయ్యేదిగాదు. ఆ సుస్వరాలు వింటూ ఈ జీవితకాలం గడిపెయ్యాలనిపించేది. గలగల పారే గోదావరిలా హాయిగా నవ్వుతూ ఆప్యాయంగా పలుకరించేది. నా రూమ్మేటేమో పుస్తకం పురుగు. ఇవేవీ పట్టించుకునే వాడు కాదు.

డిగ్రీ ఫైనల్ పరీక్షలవగానే బిచాణా ఎత్తేశాం. రేవతి తండ్రి రిటైర్డ్ మిలిటరీ మేజర్. అతని అనుభవాలు నాకెంతో స్ఫూర్తినిచ్చాయి. గది ఖాళీ చేసి బయటి కొచ్చేటప్పుడు రేవతి తలుపుచాటు చూపులు ఇప్పటికీ నా తలపుల తలుపుల్ని తడుతుంటాయి.

సినిమా ప్రారంభం కాబోతుంది. హాల్లో జనాలు నిండిపోతున్నారు. చివరి ఐదు నిముషాల్లో బాల్కనీ నిండిపోయింది. అమ్మో ! న్యూస్ రీలు నడిచేటప్పుడు హాలంతా నిండిపోయింది.

ఇంటర్వెల్‌లో సరిగా చూశాను రేవతిని. అదే నొక్కులజుట్టు. అవే తుమ్మెద రెక్కల కనురెప్పలు. అదే ముఖారవిందం.

అవయవ సంపద పెరిగి కాస్త ఒళ్ళు చేసినట్టుంది కాని ... ఎక్కుపెట్టిన విల్లులాంటి కనుబొమల మధ్య బాణం లాంటి దోసగింజ బొట్టు ... ఏదీ ? అదేదీ ?

మనిషిగా సినిమా చూస్తున్నాను గాని మనసు ఆమెచుట్టూ తిరుగుతోంది. విషయం తెలుసుకోవాలనే ఆసక్తి క్షణక్షణం పెరిగిపోతూంది. బయటి కొచ్చాము.

"మా ఇంటికెళ్దాం పదండి" కళ్లను గమ్మత్తుగా తిప్పేస్తూ తానే అంది. అప్పుడు గమనించింది నాకు ఎడమచెయ్యి లేదని.

"అరె ... మీ చెయ్యి ఏమైందీ?" కనుబొమలు పైకి లేచినై.

"దేశమాత కిచ్చేశా."

ఆటోలో కూచున్నాం.

"అంటే ... ?"

"డిగ్రీ పూర్తవగానే ఆర్మీలో చేరాను. కార్గిల్ యుద్ధం నా చేతిని కానుకగా తీసుకుంది. విజయగర్వంతో డిశ్చార్జై వచ్చేశాను." మూడు ముక్కల్లో చెప్పేశాను. కొత్తగా పరిచయమైనట్టు ఆమె నిశితదృక్కులు నన్నాపాదమస్తకం తడిమాయి.

"మరిప్పుడేం చేస్తున్నట్టూ !" ఆనాటి చిరునవ్వు. ఆ నవ్వు వెనక ఇంకేదో ఉన్నట్టుంది.

యుద్ధంలో చెయ్యి పోగొట్టుకున్నానంటే ... సమాధానం చిరునవ్వు. రేవతిలో ఎలాంటి మార్పు చోటుచేసుకుందో !

"ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద బ్యాంకు ఉద్యోగం దొరికింది. ఈ మధ్యనే ఈ ఊరికొచ్చాను."

"పెళ్లీ ... పిల్లలూ ... !"

నన్నేమీ అడగనివ్వకుండా వన్‌వే ట్రాఫిక్‌లాగా ఆమె ప్రశ్నలే వస్తున్నాయి. సరే.. తర్వాత ఛాన్సు నాదే గదా.

"పెళ్లైంది ... ఓ పాప" ఇంకేవేవో వివరాలు ... ఆటో ఆగింది. ఆటోమేటిగ్గా దిగేశాం. తాళం తీసి ముందు తాను ఇంట్లోకెళ్లింది.

"రండి .. రండి" ఆహ్వానిస్తూ అడుగు వేస్తోంది. కాలి పట్టా గొలుసుల గజ్జెల సవ్వడి పసందుగా ఉంది.

రెండుగదుల చిన్న పోర్షన్. కిటికీలకు తెల్లని తెరలు, గుమ్మాలకు పూల కర్టెన్లు. సౌజన్యమూర్తి సంస్కారంలా నిర్మలంగా ఉంది.

ఇద్దరమూ మొహాలు కడుక్కొని ఫ్రెష్ అయాం. ఫ్లాస్కులోంచి చాయ్ వంచి టీపాయ్ మీదుంచింది. మరో వైపు తాను కూచుంది వయ్యారంగా. నా ఎదురుగా వనదేవత కొలువు దీరినట్టనిపించింది. భుజాల చుట్టూ పైట కప్పుకుంది.

కళ్లతో చాయ్ కప్పు చూపించింది. అప్పుడు గూడా బొట్టు లేదు. చెవుల రింగులు తళుక్కుమంటున్నాయి. పాశ్చాత్య నాగరికత ప్రభావం. ఆ ఫ్యాషన్ పరేడ్‌లో రేవతి గూడా భాగస్థురాలైందేమో !

"ఇహ తమరి సంగతులు చెప్పాలి" బోసిబోయిన మొహాన్ని వింతగా చూస్తూ చాయ్ కప్పందుకున్నాను.

"అమ్మా ... " ఆరేళ్ల కుర్రాడు జింకపిల్లలా గంతులేస్తూ వచ్చి రేవతి ఒడిలో వాలిపోయాడు.

"విక్రమ్ ! ట్యూషన్నుండి ఎప్పుడొచ్చావ్ నాన్నా?" లేత చెంపల్ని అరచేతులతో నిమిరి నుదురు ముద్దాడింది.

"అప్పుడే వచ్చిన. తాతయ్యతో ఆడుకుంటున్నానమ్మా."

"వీడు నా కొడుకు విక్రమ్. ఆ సినిమా ఇతివృత్తం సైనికుని కథ గదా ! యుద్ధం దృశ్యాలు కూడా ఉన్నాయన్నారు. వీణ్ని ట్యూషన్‌కు పంపించి నేనటు వచ్చాను. ఇంటి ఓనరు బాబాయి చాలా మంచివాడు. వీడంటే ప్రాణం." బాబు అరచేతుల్తో తన చెంపల్ని రాసుకుంది.

జీవన ప్రస్థానంలో ఎన్ని మలుపులో, ఎన్ని గెలుపులో, మరెన్ని ఓటములో ! నా బుర్రలో భూగోళం గిర్రుగిర్రుమంటోంది. ఇహ ఆ ఒత్తిడిని భరించలేక పోయాను.

"పెళ్లెప్పుడు చేసుకున్నావు రేవతీ?"

వీడెవడ్రా ... అన్నట్టుగా విక్రమ్ నా వైపు గుర్రుగా చూస్తున్నాడు.

"బాబూ ! వీరు చంద్రం గారు. నా నేస్తం. నమస్కారం చెయ్యాలి" అంది గారాబంగా. బాబు మొహం బంతిపూవులా విచ్చుకుంది. నన్నోసారి ఎగాదిగా చూసి

"నమస్తే !" చేతులు జోడించాడు నవ్వుతూ.

అబ్బో ! గొప్ప సంస్కారమే.

"నమస్తే బాబూ ! ఇలారా !!" చేతులు చాచాను. తల్లి గ్రీన్ సిగ్నలందుకుని నా పక్కన కూచున్నాడు.

"అమ్మా !" అరచేత్తో కడుపుమీద రాసుకున్నాడు బాబు.

"ఓహ్, నీకు పాలు గదూ ! ఇస్తా రా" అని లోపలికి తీసుకెళ్లింది. ఐదు నిముషాల తర్వాత మువ్వలసవ్వడి వినబడింది. తిరిగి వస్తుందన్నమాట. ఆమె కాళ్లను, పట్టాగొలుసుల్ని కళ్లారా చూడాలనే ప్రయత్నం విఫలమైంది.

"మా రెండు ప్రాణాలకు రెండు ఫ్లాస్కులు, వానికి పాలు, నాకు చాయ్" నవ్వుతూ కూచుంది. ఆ నవ్వులో నయాగరా జలపాతం ఛాయలతో పాటు గాంభీర్యం కూడా దాగుంది. నా దృష్టి గోడల మీదికి మళ్లింది. పార్థసారథి, శ్రీ వేంకటేశ్వరుని పటాల మధ్య ఓ అమరజవాను ఫోటో ఉంది. పటాలతో పాటు ఆ ఫోటోగ్గూడా పూలదండ వేసుంది. నా చూపులక్కడే ఆగిపోయినై.

"ఆ ఫోటో మావారిదే" రేవతి గొంతు గంభీరమైంది. "ఇంటర్ పాసవగానే నాకు ఆనంద్‌తో పెళ్లైంది. ఆనంద్ అంత పెద్ద మిలిటరీ ఆఫీసరైనా... అమృతమూర్తి. తన ప్రేమసాగరంలో నన్ను మునకలు వేయించాడు. లాలించాడు. పాలించాడు. దేశమంతా తిప్పాడు. జీవన మాధుర్యాన్ని దోసిళ్లతో అందించాడు. స్వర్గసుఖాలంటే ఏమిటో ప్రత్యక్షంగా రుచిచూపించిన నా భర్త .. కార్గిల్ యుద్ధంలో కైవల్యప్రాప్తి చెందాడు. దేశంకోసం ప్రాణాలిచ్చి నన్ను వీరపత్నిని చేశాడు. అతని ప్రతిరూపమే ఈ విక్రమ్. అతని బలిదానమే నాకీ టీచర్ ఉద్యోగాన్నిప్పించింది." రేవతి కళ్లు మొదట మంచుపూలై ఆ తర్వాత ధారాపాతాలైనాయి.

నన్ను మించిన దేశభక్తుడీ ప్రాంతంలోనే లేడనుకున్న నా అజ్ఞానం పటాపంచలైంది. ఆనంద్ అనే హిమాలయం ముందు నేనొక ఇసుకరేణువునైపోయాను.

"కంగ్రాట్స్ రేవతీ!" మనసారా అభినందించాను. నువ్వు ధన్యజీవివి. నీ భర్త వీరుడు. భరతమాత పాదాల చెంత పరవశించాడు. ఆ అదృష్టం అందరికీ రమ్మంటే వస్తుందా ? నాలో ఆనందావేశాలు వెల్లువెత్తినై. ఇంకేమడగాలో అర్థం కాలేదు. కాని ... ఇంకెంతో మాట్లాడాలి.

"మా ఇల్లు పక్కవీధిలోనే. వెళ్దాం పద" లేచి నుంచున్నాను.

"ఇప్పుడా ? టైం ... ఏడైంది" అమరవీరుని కీర్తిలా వెలిగిపోతున్న ట్యూబులైటు వైపు చూసింది.

"ఏం పరవాలేదు."

బాబు మా ఇద్దరి మధ్య నడుస్తున్నాడు.

జణ్... జణ్... ఝణ్.. ఝణ్.. పట్టాగొలుసు గజ్జెల చప్పుడు లయబద్ధంగా వినబడుతుంది. ఆ శబ్దతరంగాలు నా మనస్సాగరతరంగాలతో కలిసి కమ్మని రాగాలు పలికిస్తున్నాయి.

"వారెవ్వా .... జంట చూడ ముచ్చటగా ఉంది."

"ఆ బాబు ... బలే బాగున్నాడు."

ఎదురొస్తున్న ముసలి జంట ముచ్చట్లు విని మోహాలు చూసుకున్నాం. గమ్మత్తుగా నవ్వుకున్నాం.

"ఈ పట్టా గొలుసులు ఆ నాటివేనా రేవతీ ?" అడుగులో అడుగేస్తూ ముసలి జంటను దాటేశాము.

"ఆఁ ! పెళ్లయాక మా వారు వాటిని కరిగించి అదే మోడల్‌లో మళ్లీ చేయించారు. వీటి గజ్జెల చప్పుడు వింటూ ఆనంద్ పరవశించి పోయేవాడు. ఉత్తరాల్లో గూడా వీటి ప్రస్తావన ఉండేది !"

అయితే.. ఆనంద్ టేస్టూ, నా టేస్టూ ఒకటేనన్న మాట. మాటల్లోనే ఇంటి కొచ్చేశాం.

మా అమ్మ ఎదురొచ్చింది. కనుబొమలు ముడిపడినై. 'ఎవర్రా ఈమె ?' అన్నట్టుగా చూసింది నా వైపు.

పరిచయం చేశాను. రేవతి, విక్రమ్ అమ్మకు నమస్కరించారు. అమ్మ మొహం మబ్బులు వీడిన ఆకాశంలాగైపోయింది. తృప్తిగా నిట్టూర్చింది. "నేను చాయ్ తెస్తాను." లోపలికెళ్లబోయింది అమ్మ.

"వద్దండీ ... చాయ్ ఇప్పుడే తాగాం గదా !" రేవతి వారించింది.

"వంట చెయ్యాలమ్మా. రేవతి మనతో భోంచేస్తుంది ..." నా మాట పూర్తి కాలేదు.

"మరి నేనో ?" విక్రమ్ పరాక్రమించాడు.

"హరి పిడుగా" వాణ్ని అమాంతం దగ్గరకు తీసుకుంది అమ్మ.

"నిన్నొదిలి పెట్టి మేమే తింటామా ?" నుదురు ముద్దాడింది. ఇంత సంతోషం అమ్మలో నేనీ మధ్యన చూడలేదు.

"మరి .. మీ కోడలూ.." అమ్మనడిగింది రేవతి.

"నాన్నా ... నానమ్మా !" అప్పుడే నిద్రలేచి వచ్చింది నా మూడేళ్ల కూతురు. అమ్మ ఒడిలో విక్రమ్‌ని చూసి అక్కడే ఆగిపోయింది. ముద్ద మందారం లాంటి మొహం కాస్త ముడుచుకు పోయింది. నన్నూ, రేవతినీ మార్చి మార్చి చూస్తోంది. కళ్లు మిటకరిస్తోంది.

"ఇది నా కూతురు... శ్రుతి" రేవతితో చేప్పేసి "రామ్మా !" చేతులు చాచాను. వాళ్లమ్మలాగే అడుగులో అడుగేసుకుంటూ వస్తోంది. చిన్నారి పట్టాగొలుసుల పొన్నారి గజ్జెలు గమ్మత్తుగా శబ్దిస్తున్నాయి. వచ్చి ఒడిలో కూచుంది.

"పాప బొద్దుగా ముద్దుగా ఉంది. రామ్మా శ్రుతీ !" రేవతి చేతులు చాచింది. శ్రుతి నా వైపు చూసింది ఏం చెయ్యాలని.

"చూడమ్మా ... అదిగో అతడు విక్రమ్. మనకు దోస్త్. వెళ్లమ్మా" అన్నాను వీపు నిమురుతూ. గబుక్కున జారి వెళ్లి రేవతి బాహువుల్లో బందీ అయింది. రేవతి ఏం మంత్రమూదిందో గాని శ్రుతి నవ్వు మొహానికొచ్చింది.

"తల్లి లేని పిల్లనమ్మా !" అమ్మ గొంతు గంభీరమైంది. గోడకు తగిలించిన నాభార్య ఫోటోను చూపిస్తూ "అప్పుడు మా వాడు మంచుకొండలల్ల శత్రువులతో యుద్ధం చేస్తుంటే ఇక్కడ నా కోడలు మృత్యువుతో యుద్ధం చేసింది. దీన్ని లోకంలో వదిలేసి తాను మరో లోకానికెళ్లిపోయిందమ్మా. ప్రాణాలు విడుస్తూ మా వాడినే వలవరించింది. నా ఇంటి దీపం అట్లా ఆరిపోయిందమ్మా !" గొల్లుమంది.

ఆలోచనాలోచనాల్లో నా భార్య రూపం కదలాడింది.

"ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన నాభార్య ... నా గుండె గూటిలో శాశ్వతస్థానం సంపాదించుకుంది. తాను గుండెజబ్బుతో కుస్తీ పడుతూ నన్ను యుద్ధరంగానికి పంపించింది. శత్రువుల గుండెలు బద్దలు చెయ్యాలని నన్ను ప్రోత్సాహపరిచింది. కాని ... తానే గుండెజబ్బుకు బలైంది.." నా కళ్లు ఊటచెరువులైపోయినై. బరువెక్కిన గుండెలు తేలికైపోయినై.

"అయ్యయ్యో ... అదా సంగతీ ! పాపను పక్కన కూచోపెట్టి రేవతి కదిలొచ్చింది. అమ్మ కళ్లనూ, నా కళ్లనూ తన కొంగుతో అద్ది తన కళ్లను కూడా అద్దుకుంది.

"మా నాన్న దేవుని దగ్గరికి పోయిండు, తెల్సా !" విక్రమ్ కళ్లు విశాలమైపోయినై. చూపులు శ్రుతి మీద నిలిచిపోయినై. నవ్వాలో, ఏడ్వాలో అర్థం కాలేదు కాబోలు శ్రుతి అలాగే చూస్తోంది.

నేనెందుకలాగైపోయాను ? నా గుండె నిబ్బరమేమైంది ?

ఆత్మీయులు అంతర్ధానమైనప్పుడు గుండె ఘోష ఇలాగే ఉంటుందేమో ! నన్ను నేను కంట్రోల్ చేసుకోగలిగాను.

"పోయినోళ్ల తీపి గుర్తులే గదా మనల్ని బతికిస్తుంటాయి" రేవతి నిర్వేదంగా నవ్వింది. ఆ నవ్వులో అనుభవసారం తొణికిసలాడింది.

"మనమాడుకుందాం రా" విక్రమ్ శ్రుతి చెయ్యందుకున్నాడు.,

శ్రుతి కిసుక్కున నవ్వింది. బుల్లినడకతో కేరింతలు కొడుతూ విక్రమ్ ననుసరిస్తోంది.

"మా అమ్మగ్గూడా గజ్జెలున్నాయి" గర్వంగా చెప్పాడు విక్రమ్.

శ్రుతి కేమర్థమైందో... వాళ్లమ్మ ఫోటోవైపు చూపింది. మేము మొహాలు చూసుకున్నాం. పసిపిల్లలు బొమ్మల మధ్య బొమ్మలై ఆడుకుంటున్నారు.

వంట సంగతి చూస్తానంటూ అమ్మ లోపలికెళ్లింది. తాను గూడా వస్తానంది రేవతి. అమ్మ వారించింది.

మేము కొన్ని సంవత్సరాలు వెనక్కు వెళ్లాం. అప్పుడు... మేము స్వేచ్ఛాజీవులం. రేవతి ఇంట్లో మా మిత్రుల కోలాహలం. ఆమె స్నేహితురాళ్ల చిల్లర సవాళ్లు, మా టోకు జవాబులు, కాలేజీ ఉత్సవాలు, లెక్చరర్ల ప్రవర్తన ... ఒక దాని వెంట ఒకటి వరుసగా నెమరేసుకున్నాం, మళ్లీ కళాశాల విద్యార్థులమై... ఎంతసేపైందో ! అమ్మ భోజనాలకు రమ్మంది. అప్పుడొచ్చా మీ లోకానికి.

కొద్ది సేపు కలిసి ఉంటే వారు వీరైపోతారన్నట్టు అమ్మా, రేవతీ పాతవాళ్లైపోయారు. ఉల్లాసంగా మాట్లాడుకుంటున్నారు. సరదా కబుర్లతో భోజనాలు ముగించాం.

బయటికొచ్చి కుర్చీల్లో కూచున్నాం. శ్రుతి నిద్రలోకి జారుకుంది. విక్రమ్ వెళ్దామని వాళ్లమ్మ కొంగులాగుతున్నాడు.

"అమ్మా రేవతీ !" ఆశగా పిలిచింది అమ్మ.

"చెప్పండమ్మా !"

"వయసులో ఉన్నావు. ఒంటరి జీవితం కంటకం గదా ! ఎన్నాళ్లిలా ... " ఏదో ప్రస్తావించబోయింది అమ్మ.

"నేనా? ఒంటరిదాన్నా ?" రేవతి మొహం పంచవర్ణ చిత్రమైంది. "కాదమ్మా, మా

వారి త్యాగబలం, విక్రమ్‌ను ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా తీర్చిదిద్దాలనే ఆశ, మాతృభూమి సేవలో మా వాడు మేటి అనిపించుకోవాలనే ఆశయాలు నా వెంటున్నాయి. కదన్నయ్యా!" నావైపు మళ్లాయామె చూపులు. దృఢ నిర్ణయం, పట్టుదలతో ఆమె కళ్లు కాంతివంతమై పోయినై.

నా నవనాడుల్లో నాదస్వరం వినిపించింది. రేవతి లేచి నుంచుంది.

"అవును చెల్లెమ్మా... నా అంతరంగతరంగాలు సరికొత్త స్ఫూర్తిని సంతరించు కున్నాయి. "నా భార్య త్యాగం తక్కువదేమీ కాదు. పాపను మెడిసిన్ చదివించి మిలిటరీ డాక్టర్‌ను చెయ్యాలని ఎన్నోసార్లు అనేది. ఆమె ఆశయసాధనే నా ఊపిరి. అంతకుమించి నాకే ఆశలూ లేవమ్మా ! నా భార్య కాలి అందెల రవళి నా చెవుల్లో ఎప్పుడూ కాపురముంటుంది. అదే నా కాలంబన."

గుంభనంగా ఉన్న నా మనసు మైదానంలో ఉషోదయమైంది.

❀ ❀ ❀

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక,
8 సెప్టెంబర్, 2001